ఆదివారం
15- 06- 2025
విజయనగరం : ప్రచురణ
సంపుటి : 02 సంచిక : 135
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by :
Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari,Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com
స్థాపితం : 2008
RNI No. APTEL/2008/24928
Postal Registration No. : VZM/22/2020-2022
Period of Renewal. : 01-01-2023 to 31-12-2025

# ప్రజాస్వామ్యం
తెలుగు దినపత్రిక
PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

న్యూస్ పేపర్స్ యాజమాన్యానికి శుభవార్త

అతి తక్కువ ధరలకే బ్లాక్ అండ్ వైట్, మల్టీకలర్ దినపత్రికలు, వార పత్రికలు, పక్ష పత్రికలు మరియు మాస పత్రికలు ప్రింటింగ్ చేయబడును
ట్రాన్స్‌పోర్ట్ సదుపాయం కలదు
ఇట్లు
ప్రజాస్వామ్యం తెలుగు దినపత్రిక ప్రింటింగ్ యూనిట్
Cell : 93470 64455

## దక్షిణాఫ్రికా ఖాతాలో తొలి ఐసీసీ టైటిల్

- వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియాపై ఘన విజయం
- 5 వికెట్ల తేడాతో కంగారూలను చిత్తు చేసిన సఫారీలు
- సూపర్ సెంచరీతో (136) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఐడెన్ మార్క్రమ్
- లార్డ్స్ మైదానంలో దక్షిణాఫ్రికా చారిత్రక గెలుపు
- ఎన్నో ఏళ్ల ఐసీసీ ట్రోఫీ నిరీక్షణకు తెర



దక్షిణాఫ్రికా క్రికెట్ చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించబడింది. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ఐసీసీ టైటిల్ కలను సఫారీ జట్టు మిగతా..2లో

## తల్లికి వందనం'... ఒకే ఇంట్లో 12 మంది పిల్లలకు రూ.1.56 లక్షలు

- ఏపీలో 'తల్లికి వందనం' పథకం కింద
- తల్లుల ఖాతాల్లో నగదు జమ
- ఒక్కో విద్యార్థికి రూ.13,000 చొప్పున ఆర్థిక సహాయం
- అన్నమయ్య జిల్లాలో ఉమ్మడి కుటుంబంలోని 12 మంది పిల్లలకు రూ.1.56 లక్షలు
- కర్నూలు జిల్లాలో ఆరుగురు విద్యార్థినుల తల్లికి రూ.78,000 జమ



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మిగతా..2లో

## ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తే, పరిణామాలు తీవ్రంగా ఉంటాయి'..

### ప్రపంచ దేశాలకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్!



- ఇరాన్ పై ఇజ్రాయెల్ జరిపిన ప్రాణాంతక వైమానిక దాడిలో 78 మంది మరణించగా,
- ఇరాన్ ప్రజలు అక్కడి నియంతృత్వానికి వ్యతిరేకంగా నిలబడాలని బెంజమిన్ నెతన్యాహు పిలుపునిచ్చారు.

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా మూడవ ప్రపంచ యుద్ధం సంభవించే అవకాశం ఉందేమో అనిపిస్తుంది. ఇరాన్ పై ఇజ్రాయెల్ జరిపిన ప్రాణాంతక వైమానిక దాడిలో 78 మంది మరణించగా, వందలాది మంది గాయపడ్డారని వెల్లడైంది.

## 1450 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు.. రూ.1052 కోట్ల టెండర్లు పిలవాలి- చంద్రబాబు



అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో సీఆర్డీఏ అథారిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇది 49వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం. ప్రభుత్వ సముదాయం పరిధిలో 1450 ఎకరాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నారు. వీటి కోసం రూ.1052 కోట్ల టెండర్లు పిలవాలని నిర్ణయించారు. సీడ్ యాక్సెస్ రోడ్డును జాతీయ రహదారికి అనుసంధానించడానికి రూ.682 కోట్లకు టెండర్లు కూడా పిలవనున్నారు. గ్రీన్ అండ్ బ్లూ సిటీ గురించి అధికారులతో చర్చలు జరిపినట్లు మంత్రి నారాయణ తెలిపారు. లక్నో సందర్శన గురించి తన అభిప్రాయాలను ఆయన పంచుకున్నారు. అక్కడ వారు నది బండ్ నిర్మాణం గురించి అధ్యయనం చేశారు. లక్నోలో తాము చూసిన ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ గురించి కూడా నారాయణ ముఖ్యమంత్రికి చెప్పారు. ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను అధ్యయనం చేయడానికి యుపి అధికారులు అమరావతిని సందర్శిస్తారని మంత్రి వెల్లడించారు. ప్రజా రాజధాని అమరావతిని మూడేళ్లలో పూర్తి చేసేలా టెండర్లు పిలిచే ప్రక్రియను %జ=ణూ% అథారిటీ వేగవంతం చేసింది.

## ప్రధాని నరేంద్ర మోదీ జూన్ 15 నుంచి 19 వరకు విదేశీ పర్యటన

- తొలుత సైప్రస్, తర్వాత కెనడా, చివరగా క్రొయేషియాలను సందర్శన
- కెనడాలోని కాననాస్కిస్‌లో జీ-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని
- ఇంధన భద్రత, ఏఐ, క్వాంటం అంశాలపై కీలక చర్చల్లో భాగస్వామ్యం
- రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌కు, తొలిసారిగా క్రొయేషియాకు భారత ప్రధాని
- యూరోపియన్ యూనియన్‌తో బంధాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి



ఢిల్లీ: దేశంలో ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం తెలిసిందే. ఈ కీలక పరిణామం అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన తొలి విదేశీ పర్యటనకు శ్రీకారం చుట్టారు. జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు ఆయన సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల్లో పర్యటించనున్నారు. 'ఆపరేషన్ సిందూర్' ఇచ్చిన నూతనోత్సాహంతో ప్రధాని చేపడుతున్న ఈ యాత్ర, అంతర్జాతీయంగా భారత్ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని దౌత్య వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటన వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శనివారం అధికారికంగా ప్రకటించింది.

**సైప్రస్ పర్యటన**

## నా తండ్రి ఇలాగే మరణించారు.. వారి బాధను అర్థం చేసుకోగలను

- అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై రామ్మోహన్ నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష
- దర్యాప్తునకు ఐదుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడి
- హోంశాఖ సెక్రటరీ నేతృత్వంలో మరో ప్రత్యేక బృందం
- లభ్యమైన బ్లాక్ బాక్స్, విశ్లేషణ తర్వాత వివరాలు వెల్లడిస్తామన్న మంత్రి



అమరావతి : "నా తండ్రి కూడా ప్రమాదంలోనే మరణించారు. అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద ప్రభావ కుటుంబాల బాధ నాకు తెలుసు.. నేను అర్థం చేసుకోగలను" అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనను పౌర విమానయాన శాఖ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ దుర్ఘటనపై శనివారం ఆయన ఢిల్లీలో ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టామని, గుజరాత్ ప్రభుత్వం, పౌర విమానయాన శాఖ సమన్వయంతో పనిచేశాయని తెలిపారు.

## రాష్ట్రంలో అభివృద్ధిని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారు



- శాంతిభద్రతలకు విఘాతం కలిగించి అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారన్న హోంమంత్రి అనిత
- డైవర్షన్ పాలిటిక్స్‌కు జగన్ పేటెంట్ తీసుకున్నారని ధ్వజం

అమరావతి : చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకూ జగన్ ఆటలు సాగవని హోంమంత్రి వంగలపూడి అనిత ధ్వజమెత్తారు. శాంతిభద్రతలకు ఎలాగైనా విఘాతం కలిగించాలని చూసే జగన్ కుట్రలు రాష్ట్రంలో సాగనివ్వమని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

## కూర్మలో ఆధ్యాత్మిక కేంద్రానికి నిప్పు, భారీ ఆస్తి నష్టం

- దుండగుల పనేనని నిర్వాహకుల ఆరోపణ, దర్యాప్తు ముమ్మరం
- ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి
- లోతైన విచారణ జరపాలని పోలీసులకు ఆదేశం
- కూర్మ గ్రామ పునరుద్ధరణకు పూర్తి సహాయంపై భరోసా



అమరావతి : శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండల పరిధిలోని కూర్మ గ్రామంలో ప్రశాంతతకు భంగం వాటిల్లింది. ఆధ్యాత్మిక చింతనతో, ప్రకృతి ఒడిలో జీవనం సాగించే ఈ గ్రామంలోని ఇస్కాన్ రాధాకృష్ణ మందిరం కొన్నిరోజుల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందా లేక ఎవరైనా దుండగులు ఉద్దేశపూర్వకంగా నిప్పుపెట్టారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి దుశ్చర్యలు జరిగాయని మందిర నిర్వాహకుల్లో ఒకరైన ప్రభుదాస్ పోలీసులకు వివరించారు. ఈ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం మిగతా..2లో

## బనకచర్ల పేరుతో ఏపీ దోపిడీ.. కేసులు పెట్టడంలో కాంగ్రెస్ బిజీ



- సీఎం రేవంత్, ఉత్తం కుమార్‌రెడ్డి మౌనంగా ఉంటున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.
- రాష్ట్ర ప్రయోజనాలను పదవుల కోసం తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు.
- గోదావరి బనకచర్లకు టెండర్లు పిలుస్తుంటే ఎందుకు నోరు మెదపడం లేదని..

## గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం

- రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక గద్దర్ తెలంగాణ అవార్డుల ప్రదానోత్సవం
- హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్ వేదికగా జరగనుంది.
- తరుణంలో ఈ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది.
- ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయింది.




హైదరాబాద్, జూన్ 14: ప్రతిష్టాత్మక గద్దర్ తెలంగాణ అవార్డుల ప్రదానోత్సవం మరికాసేపట్లో హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్ వేదికగా జరగనుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఈ ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతోంది. అలాంటి తరుణంలో ఈ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరోహీరోయిన్లతోపాటు ప్రముఖులు భారీ ఎత్తున వస్తున్నారు. ఈ ప్రదానోత్సవంలో విజేతలకు భారీ ఎత్తున నగదు పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ ప్రదానోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు

## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు.. రేవంత్ రెడ్డి, కేంద్రంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు

- బనకచర్ల మరో పోతిరెడ్డిపాడు అవుతుందని హరీశ్ రావు ఆందోళన
- బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ ముందుకెళుతుంటే తెలంగాణ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుందని విమర్శ
- రాష్ట్ర ప్రయోజనాల కంటే కేసులపైనే ప్రభుత్వానికి ధ్యాస అని ఆరోపణ
- నిధులు, నదుల విషయంలో తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తోందని వ్యాఖ్య



హైదరాబాద్ : కృష్ణా నదీ జలాలను అక్రమంగా తరలించుకుపోవడానికి పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ఏ విధంగా ఉపయోగపడిందో, అదే విధంగా గోదావరి జలాలను తరలించుకోవడానికి బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు కీలక విషయాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుంటే, మిగతా..2లో

## కూర్మలో ఆధ్యాత్మిక కేంద్రానికి నిప్పు, భారీ ఆస్తి నష్టం

పవన్ కల్యాణ్ నేడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం దురదృష్టకరం అని పేర్కొన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపి, నిజానిజాలు నిగ్గు తేల్చాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. "ఆధునిక హంగులు లేకుండా అధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరం. శ్రీకాకుళం జిల్లా హిరమండలం సమీపంలోని కూర్మ గ్రామంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై పోలీసులు లోతుగా విచారణ చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచనలు చేశాను. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలి. కూర్మ గ్రామంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాము. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైంది. కూర్మ గ్రామవాసులు యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి ఇళ్ళల్లో ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నారు. వేద విద్యను అభ్యసించే చిన్నారులు సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్లం అనర్గళంగా మాట్లాడుతూ ఉంటారు. వర్తమాన కాలంలో విశిష్టంగా ఉన్న ఈ గ్రామం పునరుద్ధరణపై దృష్టి సారించాలి" అని పవన్ స్పష్టం చేశారు.

## నా తండ్రి ఇలాగే మరణించారు..

## వారి బాధను అర్థం చేసుకోగలను

"ఘటన జరిగిన వెంటనే మంటలను అదుపులోకి తెచ్చి, మృతదేహాలను తరలించాం. ఈ దుర్ఘటనపై తక్షణమే దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశాం. అవసరమైతే ఈ కమిటీలో మరికొంత మంది సభ్యులను కూడా చేర్చుతాం" అని వివరించారు. శుక్రవారం సాయంత్రం ఘటనా స్థలంలో విమాన బ్లాక్‌బాక్స్ లభ్యమైందని, దానిని విశ్లేషించిన తర్వాత ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. "బ్లాక్ బాక్స్‌లో ఏముందో తెలుసుకోవడానికి ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు. దర్యాప్తు ప్రక్రియ గురించి వివరిస్తూ, "హోంశాఖ సెక్రెటరీ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశాం. ఇందులో వివిధ రంగాలకు చెందిన నిపుణులు, ప్రత్యేక అధికారులు సభ్యులుగా ఉంటారు. సంపూర్ణ దర్యాప్తు జరిపేందుకు ఈ కమిటీ దోహదపడుతుంది. నిపుణుల విచారణ పూర్తయిన తర్వాత, తగిన సమయంలో మీడియాకు అన్ని వివరాలు వెల్లడిస్తాం. రెండు నెలల్లోగా విచారణ పూర్తవుతుందని ఆశిస్తున్నాం. అంతేకాకుండా, బోయింగ్ 787 సిరీస్ విమానాలను తరచూ తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం" అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## తల్లికి వందనం'... ఒకే ఇంట్లో

## 12 మంది పిల్లలకు రూ.1.56 లక్షలు

అర్హులైన తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అవుతోంది. ఈ పథకం కింద, చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.13,000 చొప్పున ఆర్థిక సహాయం అందుతుండటంతో అనేక కుటుంబాలు, ముఖ్యంగా ఎక్కువ మంది పిల్లలున్నవారు గణనీయంగా లబ్ధి పొందుతున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న కుటుంబాల ఆనందం గురించి తెలుగుదేశం పార్టీ (టీడీపీ) 'ఎక్స్' సామాజిక మాధ్యమ వేదికగా ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంది. అన్నమయ్య జిల్లా కలకడ మండలంలోని ఒక ఉమ్మడి కుటుంబంలో ముగ్గురు తల్లులకు, వారి 12 మంది పిల్లల చదువుల నిమిత్తం 'తల్లికి వందనం' కింద ఏకంగా రూ.1.56 లక్షలు జమ అయ్యాయి. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను టీడీపీ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు తమ ఖాతాల్లో జమ కావడంతో ఆ కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆ తల్లులు అపరిమితమైన సంతోషం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ తల్లులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే తరహాలో, కర్నూలు జిల్లా దేవనకొండకు చెందిన చాంద్‌బాషా, షకినాబి దంపతుల కుటుంబం కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందింది. వారికి ఆరుగురు కుమార్తెలు ఉండగా, వారందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసిస్తున్నారు. 'తల్లికి వందనం' పథకానికి వీరంతా అర్హత సాధించడంతో, వారి తల్లి షకినాబి ఖాతాలో ఇప్పటివరకు రూ.78,000 జమ అయ్యాయని విద్యార్థుల తండ్రి చాంద్‌బాషా సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తోంది. ఈ పథకం కింద అర్హులైన ప్రతి విద్యార్థికి రూ.13,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారు

## బనకచర్ల పేరుతో ఏపీ దోపిడీ.. కేసులు పెట్టడంలో కాంగ్రెస్ బిజీ

హైదరాబాద్ : కృష్ణా జలాల్లో జల దోపిడి జరిగినట్లుగా గోదావరి జలాలను బనకచర్ల ద్వారా ఏపీ దోపిడీ చేస్తుందని.. సీఎం రేవంత్, ఉత్తం కుమార్‌రెడ్డి మౌనంగా ఉంటున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేటీఆర్‌పై, బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టడంలో బిజీగా ఉన్నారని.. ప్రతిపక్షాల మీద ఇరిటేషన్ తప్ప.. ఇరిగేషన్‌పై దృష్టి లేదని.. రాష్ట్ర ప్రయోజనాలను పదవుల కోసం తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. 'బనకచర్ల ప్రాజెక్ట్ పేరుతో ఏపీ చేస్తున్న జల దోపిడి- కాంగ్రెస్ మౌనం' అన్న అంశంపై హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ అక్రమ ప్రాజెక్టు కడుతుంటే.. సీఎం, మంత్రులు మౌనం వెనుక ఉన్న కారణం ఏంటని ప్రశ్నించారు. గోదావరి బనకచర్లకు టెండర్లు పిలుస్తుంటే ఎందుకు నోరు మెదపడం లేదని.. కృష్ణా నీళ్లు తాత్కాలిక ఒప్పందానికి మించి ఏపీ తీసుకుపోతుంటే ఎందుకు మాట్లాడరని నిలదీశారు. గోదావరి నదిలో తెలంగాణకు ద్రోహం తలపెడితే ఎందుకు స్పందించరని.. నిధులు, నదులు రెండు ఆంధ్రాకేనని.. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా నిధుల్లో, నదుల్లో అన్యాయం జరిగినా మాట్లాడడం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉండి నోరు మెదపడం లేదని ధ్వజమెత్తారు. రెండు టీఎంసీ బాబ్లీ ప్రాజెక్టు కోసం మహారాష్ట్ర మీద చంద్రబాబు పెద్ద పోరాటం చేశారని.. మరి నేడు 200 టీఎంసీ బనకచర్ల ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఎంత పోరాటం చేయాలని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎందుకు ఒక్క మాట మాట్లాడటం లేదని.. మీ దోస్తానా కోసం తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడతారా రేవంత్? అని నిలదీశారు. తెలంగాణ కంటే పది రెట్ల నిధులు ఆంధ్రకి ఇచ్చినమని స్వయంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆంధ్రాలో చెప్పాడని.. కేంద్రంలో పరపతితో చంద్రబాబుపై నుంచి కాకుండా పోలవరం నుంచి నీళ్ల మళ్లించి.. కేంద్రం నుంచి నదుల అనుసంధానం పేరుతో నిధులు తెచ్చుకున్నదని ఆరోపించారు. అయినా రేవంత్ రెడ్డికి, మంత్రులకు కదలిక లేదని.. ఇప్పటికైనా కళ్లు తెరవాలని.. నష్టం పూర్తిగా జరగకముందే గోదావరి బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఏ రకమైన పోరాటంలోనైనా బీఆర్ఎస్ కలిసి వస్తుందని.. అసెంబ్లీలో తీర్మానం చేద్దామంటే సహకరిస్తామన్నారు. మీరు ముందుకు రాకపోతే బీఆర్ఎస్ పార్టీ ప్రజా పోరాటానికి, న్యాయపోరాటానికి శ్రీకారం చుడుతుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టొద్దని.. రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు బంద్ ఆపాలని, చరిత్ర హీనుడిగా మిగిలిపోవద్దని హితవు పలికారు. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మౌనం వీడాలని.. చంద్రబాబు జల దోపిడిని అడ్డుకోవాలని సూచించారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు... కేంద్రానికి తెలంగాణ మంత్రి లేఖ

తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అంశం మరోమారు వివాదాస్పదమైంది. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని, దీనిని తక్షణమే అడ్డుకోవాలని ఆయన ఆ లేఖలో కోరారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలశక్తి శాఖకు రాసిన లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన ఈ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు, గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) అవార్డుతో పాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక సాధ్యసాధ్యతల నివేదిక (పీఎఫ్ఆర్)కు కేంద్రం ఇంకా ఆమోదం తెలపకముందే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీపీఆర్ ఎలా అడుగుతుందని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ పీఎఫ్ఆర్‌ను తిరస్కరించాలని, డీపీఆర్ సమర్పించకుండా ఆంధ్రప్రదేశ్‌ను నిలువరించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎటువంటి టెండర్లు పిలవకుండా ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా మంత్రి ఉత్తమ్ తన లేఖలో కేంద్రాన్ని కోరారు.

## గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం

మొదటి పేజి తరువాయి



తెలంగాణ ప్రభుత్వం భారీ ఎత్తున కసరత్తు చేసిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టాలీవుడ్ చిత్రాల్లో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి.. నంది అవార్డుల పురస్కారాన్ని అందజేసేవారు. అయితే 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయింది. అదే సమయంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయింది. అనంతరం 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీ గెలిచింది. ఈ దాదాపు 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో టాలీవుడ్‌లో విడుదలైన ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి పురస్కారాలు అందించే కార్యక్రమం ఒక్కటి జరగలేదు. ఇక 2023లో ఎన్నికల వేళ.. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. గద్దర్ పేరిట సినిమా పురస్కారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఇచ్చిన హామీ మేరకు గద్దర్ పేరిట సినిమా పురస్కారాలు అందజేసేందుకు చర్యలు చేపట్టింది. అందులోభాగంగా సహజ నటి జయసుధ అధ్యక్షతన 2024 ఏడాది ఉత్తమ చిత్రాల ఎంపిక కోసం జ్యూరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అన్ని క్రాఫ్ట్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి గద్దర్ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఇక రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి అంటే.. 2014 నుంచి 2023 వరకు ఉత్తమ చిత్రాలను మూడు కేటగిరిగా ఎంపిక చేశారు. ఈ కమిటీకి ప్రముఖ నటుడు మాజీ ఎంపీ మాగంటి మురళీ మోహన్ చైర్మన్‌గా వ్యవహరించారు.

# ప్రధాని నరేంద్ర మోదీ జూన్ 15 నుంచి 19 వరకు విదేశీ పర్యటన

మొదటి పేజి తరువాయి



తొలుత జూన్ 15, 16 తేదీలలో సైప్రస్‌లో ఉంటారు. ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ పర్యటన ఖరారైంది. విశేషమేమిటంటే, రెండు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని సైప్రస్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి. నికోసియాలో అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి చర్చలు జరుపుతారు. అనంతరం లిమాసోల్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. ఈ భేటీలు మధ్యధరా ప్రాంతం మరియు యూరోపియన్ యూనియన్‌తో భారతదేశపు వ్యూహాత్మక బంధాలను కొత్త శిఖరాలకు చేర్చుతాయని ఆశిస్తున్నారు.

### కెనడాలో జీ-7 సదస్సు

ఆ తర్వాత, జూన్ 16, 17 తేదీల్లో కెనడాలోని కాననాస్కిస్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక జీ-7 శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొంటారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు ఆయన ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ప్రధాని మోదీ జీ-7 సదస్సులో పాలుపంచుకోవడం ఇది వరుసగా ఆరోసారి కావడం గమనార్హం. ఈ వేదికపై ఇంధన భద్రత, ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ)-ఇంధన రంగాల అనుసంధానం, క్వాంటం టెక్నాలజీ వంటి కీలక అంశాలపై ప్రధాని తన అభిప్రాయాలను పంచుకుంటారు. పలు దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు కూడా నిర్వహించనున్నారు.

### చారిత్రక క్రొయేషియా పర్యటన

ఈ విదేశీ పర్యటన చివరి అంకంలో, జూన్ 18న ప్రధాని మోదీ క్రొయేషియాను సందర్శిస్తారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెన్కోవిక్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరగనుంది. ఒక భారత ప్రధాని క్రొయేషియాలో పర్యటించడం ఇదే ప్రప్రథమం కావడంతో దీనికి చారిత్రక ప్రాధాన్యత ఏర్పడింది. భారత్-క్రొయేషియా సంబంధాలలో ఇదొక సువర్ణాధ్యాయమని విదేశీ వ్యవహారాల శాఖ అభివర్ణించింది. ఈ పర్యటన ద్వారా యూరోపియన్ యూనియన్‌లోని ముఖ్య దేశాలతో భారత్ సంబంధాలు మరింత పటిష్ఠం అవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# దక్షిణాఫ్రికా ఖాతాలో తొలి ఐసీసీ టైటిల్

మొదటి పేజి తరువాయి

ఎట్టకేలకు నిజం చేసుకుంది. లండన్‌లోని చారిత్రక లార్డ్స్ మైదానం వేదికగా జరిగిన ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 ఫైనల్లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో చిత్తు చేసి, తొలిసారి విశ్వవిజేతగా అవతరించింది. ఇప్పటివరకు పలు ఐసీసీ ఈవెంట్లలో సెమీస్, ఫైనల్స్ వరకు వచ్చి చతికిలపడిన దక్షిణాఫ్రికా, ఈ విజయంతో తమపై ఉన్న "చోకర్స్" ముద్రను చెరిపేసుకుంది. ఈ చారిత్రక విజయంలో ఓపెనర్ ఐడెన్ మార్క్రమ్ (136) అద్భుత శతకంతో కీలక పాత్ర పోషించాడు.

### మార్క్రమ్ వీరోచిత శతకం... బవుమా అండ

జూన్ 11న ప్రారంభమైన ఈ ఫైనల్ మ్యాచ్ నాలుగో రోజైన జూన్ 14న ముగిసింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 285 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా, ఐడెన్ మార్క్రమ్ వీరోచిత బ్యాటింగ్‌తో సునాయాసంగా విజయాన్ని అందుకుంది. మార్క్రమ్ 207 బంతుల్లో 14 ఫోర్లతో 136 పరుగులు చేసి జట్టు విజయంలో ప్రధాన భూమిక పోషించాడు. అతనికి కెప్టెన్ టెంబా బవుమా (134 బంతుల్లో 66 పరుగులు, 5 ఫోర్లు) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. చివర్లో డేవిడ్ బెడింగ్‌హామ్ (21 నాటౌట్), కైల్ వెర్రెయిన్ (7 నాటౌట్) అజేయంగా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ 3 వికెట్లు పడగొట్టగా, హేజిల్‌వుడ్, కమిన్స్ తలో వికెట్ తీశారు.

### మ్యాచ్ ఎలా సాగిందంటే...

ఈ మ్యాచ్ లో, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాను తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులకు కట్టడి చేసింది. ఆసీస్ బ్యాటర్లలో బ్యూ వెబ్‌స్టర్ (72), స్టీవెన్ స్మిత్ (66) రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్ కగిసో రబడ 5 వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో తడబడింది. ఆసీస్ బౌలర్ల ధాటికి 138 పరుగులకే కుప్పకూలింది. డేవిడ్ బెడింగ్‌హామ్ (45), టెంబా బవుమా (36) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ 6 వికెట్లతో సత్తా చాటాడు. తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగుల ఆధిక్యం లభించడంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించినా, దక్షిణాఫ్రికా బౌలర్లు పుంజుకున్నారు. దీంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులకే ఆలౌట్ అయింది. మిచెల్ స్టార్క్ (58 నాటౌట్) ఒంటరి పోరాటం చేయగా, అలెక్స్ కేరీ (43) అతనికి




సహకరించాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో రబడ 4 వికెట్లు, లుంగి ఎంగిడి 3 వికెట్లు పడగొట్టి ఆసీస్‌ను దెబ్బతీశారు. అనంతరం, 285 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా అద్భుతంగా ఆడి చిరకాలంగా ఊరిస్తున్న ఐసీసీ మేజర్ ఈవెంట్ విజేతగా నిలవాలన్న కల నెరవేర్చుకుంది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా క్రికెట్ అభిమానుల దశాబ్దాల నిరీక్షణ ఫలించింది. ఐసీసీ టోర్నమెంట్లలో కీలక సమయాల్లో ఒత్తిడికి లోనై ఓడిపోతుందన్న అపవాదును ఈ టెస్ట్ ఛాంపియన్‌షిప్ విజయంతో సఫారీ జట్టు తుడిచిపెట్టుకుంది. మార్క్రమ్ "ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్"గా నిలిచాడు.

# రాష్ట్రంలో అభివృద్ధిని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారు

మొదటి పేజి తరువాయి

దీనికి ఎవ్వరూ విఘాతం కలిగించాలని చూసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మహిళల్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయాలనుకుంటున్న జగన్?కు సిగ్గనిపించట్లేదా అని ప్రశ్నించారు. జగన్ ఒక ఎమ్మెల్యే మాత్రమే: పొదిలిలో పోలీసులు తిరిగి ఎదురు రాళ్లదాడి చేసి ఉంటే జగన్ చుట్టూ ఎంతమంది మిగిలేవారో గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. కేజీ పొగాకు ధర కూడా తెలియకుండా పొగాకు రైతులు పరామర్శకు వెళ్లిన జగన్ మానసిక పరిస్థితి అర్థం చేసుకోవచ్చునన్నారు. జగన్ పులివెందులకు మాత్రమే పరిమితమైన ఎమ్మెల్యే అని గుర్తుపెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, తల్లులు సంతోషంగా ఉండటాన్ని వైఎస్సార్సీపీ జీర్ణించుకోలేకపోతోందని మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ విపక్ష పార్టీ కడుపు మంట చూస్తే నవ్వొస్తుందన్నారు.

### రాష్ట్రంలో అభివృద్ధిని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారు: హోంమంత్రి అనిత

అమరావతి గురించి కొందరు చేసిన వ్యాఖ్యల్ని జగన్ సమర్థించటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. కొమ్మినేని నిర్దోషి అని సుప్రీంకోర్టు ఎక్కడా నిర్ధారించలేదన్నారు. ఇలాంటి టీవీ డిబేట్లు నిర్వహించకూడదు అని సుప్రీంకోర్టు కొమ్మినేనికి షరతులతో కూడిన బెయిల్ మాత్రమే మంజూరు చేసిందన్నారు. జగన్, భారతితో క్షమాపణ చెప్పించటానికి వైఎస్సార్సీపీ మహిళా నేతలు సమావేశం పెట్టుకోవాలన్నారు. సాటి మహిళల్ని కించపరిస్తే ఆ అంశాన్ని సమర్థించుకోవటానికి వైఎస్సార్సీపీ మహిళా నేతలు సమావేశం పెట్టుకోవటాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. డైవర్షన్ పాలిటిక్స్‌కు పేటెంట్ తీసుకున్నారు: జగన్ పులివెందుల ఎమ్మెల్యేగా కూడా మిగలని పరిస్థితి తెచ్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం నిధులపై లోకేశ్ విసిరిన ఛాలెంజ్ స్వీకరించే దమ్ము ఒక్కరికి కూడా లేకపోయిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి యాప్?కు, గత ప్రభుత్వం తెచ్చిన బూటకపు దిశ యాప్?కు పొంతనే లేదని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అభివృద్ధిని అడ్డుకోవచ్చనే కుట్రతో జగన్ కిందా మీదా పడుతున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత ధ్వజమెత్తారు. జగన్ రాజకీయ ముసుగులో ఉన్న నేరస్థుడు కాబట్టే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక పోతున్నారని దుయ్యబట్టారు. పోలీసులు మీద రాళ్లు విసిరితే మాకు బీపీలు రావా అని ప్రశ్నించారు. తమకు బీపీలు వచ్చినా, చేసిన అవమానాలకు కడుపు మండినా సంయమనం పాటిస్తున్నమన్నారు. డైవర్షన్ పాలిటిక్స్?ను జగన్ పేటెంట్ తీసుకున్నాడని దుయ్యబట్టారు. జగన్ తన నియోజకవర్గానికి వస్తే అయిదుగురు పిల్లలకు తల్లికి వందనం పడిన వారిని చూపిస్తానని చెప్పారు. డీఎస్సీ నిలుపుదల చేయటానికి సుప్రీంకోర్టు వరకూ వెళ్లి కుట్రలు చేయలేదా అని ప్రశ్నించారు. నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తా: తల్లికి వందనం నిధులపై వైఎస్సార్సీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని మంత్రి సవిత తిప్పికొట్టారు. తల్లికి వందనం నిధులు లోకేశ్ జేబులోకి వెళ్లినట్లు వైఎస్సార్సీపీ నిరూపిస్తే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవిత సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే పులివెందుల ఎమ్మెల్యేగా జగన్ రాజీనామా చెయ్యాలన్నారు. అనవసరమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలు ఆనందంగా ఉండటం జగన్?కు ఇష్టం లేదా?: ప్రజలు ఆనందంగా ఉండటం జగన్?కు ఇష్టం లేదా అని మంత్రి డోలా బాల వీరాంజేయస్వామి ప్రశ్నించారు. తల్లికి వందనం పథకంలో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 13,000 రూపాయలు చొప్పున చెల్లిస్తుంటే తప్పుడు ప్రచారాలు చేయడం ఏంటని నిలదీశారు. రైతుల పరామర్శ పేరుతో వైఎస్సార్సీపీ రౌడీలను తీసుకువచ్చి నిరసన తెలుపుతున్న మహిళలపై దాడి చేయించారని మండిపడ్డారు. దీనిపై జగన్ కనీసం సానుభూతి తెలపకపోగా దొంగే దొంగ అన్నట్టుగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్సీపీ గుండాలు దాడులు చేస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా అని మంత్రి డోలా ప్రశ్నించారు. తప్పు చేస్తే ఎవరికైనా చట్ట ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు.

# ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తే, పరిణామాలు తీవ్రంగా ఉంటాయి'..

మొదటి పేజి తరువాయి

అదే సమయంలో, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంది. ఇజ్రాయెల్ సైనిక స్థావరాలు, పౌరులపై దాడి చేసింది. ఇంతలో, ఇరాన్ ప్రపంచ దేశాలకు పెద్ద హెచ్చరిక చేసింది. పాశ్చాత్య దేశాలు ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తే, వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని ఇరాన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ వైమానిక దాడిని ఆపడంలో పాశ్చాత్య దేశాలు ఇజ్రాయెల్‌కు సహాయం చేస్తే, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సైనిక స్థావరాలు, వారి యుద్ధనౌకలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ తెలిపింది. ఇదిలావుంటే, ఇరాన్ ప్రజలు నియంతృత్వాన్ని కూలదోయాలని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు విజ్ఞప్తి చేశారు. ఇరాన్ ప్రజలు అక్కడి నియంతృత్వానికి వ్యతిరేకంగా నిలబడాలని బెంజమిన్ నెతన్యాహు పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ పోరాటం మీకు వ్యతిరేకంగా కాదు, ఇరాన్ నియంతృత్వానికి వ్యతిరేకంగా ఉందని అన్నారు. ఇజ్రాయెల్ సైనిక చర్య ఇరాన్ ప్రజలకు స్వేచ్ఛకు మార్గం సుగమం చేస్తుందని ఆయన అన్నారు. ఇక, ఇజ్రాయెల్ దాడుల తర్వాత ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ యుద్ధాన్ని ప్రారంభించిందని, ఇప్పుడు ఈ యుద్ధం నుండి బయటపడలేమని ఆయన అన్నారు. ఈ నేరం నుండి ఇజ్రాయెల్ తప్పించుకోలేమని, అది తనకు తానుగా బాధాకరమైన విధిని



ఎంచుకుందని ఆయన అన్నారు. ఇజ్రాయెల్ కోసం నరకం తలుపులు తెరుచుకుంటాయని, మనం ఇజ్రాయెల్‌ను నాశనం చేస్తామని ఆయన అన్నారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్ తీసుకున్న ప్రతీకార చర్యకు ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 3 అని పేరు పెట్టారు. అదే సమయంలో, ఇజ్రాయెల్ నిర్వహించిన వైమానిక దాడికి ఆపరేషన్ రైజింగ్ లయన్ అని పేరు పెట్టారు. దాడులు చేయడమే తప్పు.. దెబ్బ తినడం తెలియని ఇజ్రాయెల్‌కు ఈసారి చేదు అనుభవం ఎదురైంది. ఇజ్రాయెల్ ఆయుధాల పేరు చెబితే మొదట గుర్తుకొచ్చేది దుర్భేద్యమైన ఐరన్ డోమ్. నిప్పుల వర్షంలా ప్రత్యర్థులు రాకెట్లు, డ్రోన్లు, మిస్సైళ్లు ప్రయోగిస్తున్నా.. ఉక్కు కవచంలా ఆ దాడులను అడ్డుకుంటుంది. అయితే ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ మిస్సైళ్లను ఐరన్‌డోమ్ సమర్థవంతంగా అడ్డుకోలేకపోయింది. ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ మిస్సైళ్లు ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌తో పాటు పలు ప్రాంతాల్లో నిప్పుల వర్షం కురిపించాయి. ఐరన్ డోమ్‌ను లోకల్‌గా కిప్పాట్ బర్జెల్‌గా వ్యవహరిస్తారు. ఇది స్వల్పశ్రేణి ఆయుధాలను అడ్డుకుంటుంది. ఇందులో రాడార్, కంట్రోల్ సెంటర్, మిసైల్ బ్యాటరీ ఉంటాయి. దూసుకొస్తున్న ముప్పును ముందుగా రాడార్ పసిగడుతుంది. అది ఎక్కడ నేలను తాకుతుందో అంచనావేస్తుంది. అక్కడ ఎటువంటి నిర్మాణాలు లేకపోతే.. వదిలేస్తుంది. అదే జనావాసాలు అయితే మాత్రం. రాకెట్‌ను ప్రయోగించి దానిని ధ్వంసం చేస్తుంది. ఈ వ్యవస్థ తయారీలో ఇజ్రాయెల్‌కు చెందిన ఎల్టా, ఎంప్రెస్ట్ సిస్టమ్, రఫెల్ సంస్థలు పనిచేశాయి. 2006లో హెజ్‌బొల్లా-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. నాడు వేల రాకెట్లను ఆ సంస్థ టెల్ అవీవ్ పై ప్రయోగించింది. దీంతో భారీగా ప్రాణనష్టం చోటు చేసుకుంది. దీంతో ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ తయారీకి నిర్ణయించింది. దీనికి అమెరికా పూర్తిగా సాయం చేసింది. 2008 నాటికి టమిర్ క్షిపణులను పరీక్షించింది. 2009లో ప్రాథమిక ప్రయోగాలు పూర్తి చేసింది. 2011 నాటికి అందుబాటులోకి తెచ్చింది. ఐరన్ డోమ్ సక్సెస్ రేటు 90శాతానికి పైగానే ఉంది. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో ఇదో అద్భుతం. అయితే 2023 అక్టోబర్ 7 నాటి హమాస్ దాడులను, తాజా ఇరాన్ క్షిపణి దాడులను అడ్డుకోవడంలో ఈ ఐరన్ డోమ్ వ్యవస్థ తడబడిందని నిపుణులు చెబుతున్నారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు.. రేవంత్ రెడ్డి, కేంద్రంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు

మొదటి పేజి తరువాయి

తెలంగాణ ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణ పనులను చురుగ్గా చేపడుతుంటే, మన ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది" అని హరీశ్ రావు విమర్శించారు. ఈ నెలాఖరు నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంకా నిద్రలోనే ఉందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేవలం ఉత్తుత్తి మాటలతో కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి కూడా ముందుకు రావడం లేదని, కేటీఆర్‌పై ఎలా కేసులు పెట్టాలనే దానిపై ఉన్న శ్రద్ధ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో లేదని ఆయన అన్నారు.

### కేంద్రం తీరుపై విమర్శలు

కేంద్ర ప్రభుత్వ వైఖరిని కూడా హరీశ్ రావు తప్పుపట్టారు. "గత రెండు కేంద్ర బడ్జెట్లను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద పారుతుంటే, తెలంగాణకు మాత్రం గుండు సున్నా దక్కింది. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే అన్నట్లుగా ఢిల్లీ పాలకుల తీరు ఉంది" అని ఆయన అన్నారు. నిధుల కేటాయింపుల్లో, నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు నోరు మెదపడం



లేదని, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా స్పందించడం లేదని విమర్శించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి మరీ సహకరిస్తోందని, తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2 టీఎంసీల బాబ్లీ నీటి కోసం 2008లో చంద్రబాబు పోరాటం చేశారని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఏకంగా 200 టీఎంసీల నీటితో ఏపీ అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంతటి పోరాటం చేయాలో ఆలోచించాలని హరీశ్ రావు అన్నారు. తమకు రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు. "ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి-బనకచర్లను అడ్డుకోండి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుంది. మీరు ముందుకు రాకపోతే, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీనే పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది" అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


ప్రజాస్వామ్యం PRAJASWAMYAM TELUGU DAILY


## ఏజెన్సీ లో నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులకే చెందాలి



**ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14 :** పాచిపెంట/ మన్యం జిల్లా..జీవో నెంబ ర్ 3 పైన. రాష్ట్ర ప్రభుత్వ ం గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని గిరిజనులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాచిపెంట మండలం పెద చీపురు వలస కోష్టు వలస జంక్షన్ల వద్ద ఆదివాసి గిరిజన సంఘం సిహెచ్ జగన్నాథం, మంచాల గంగరాజు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేయకపోవడం గిరిజనులు పాలిట శాపంగా మారిందని ఉద్యోగ భద్రత లేకుండా పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఇప్పటికైనా ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేసి జీవో నెంబర్ మూడును కొనసాగించాలని ఐటీడీఏ పరిధిలో ఉన్నటువంటి అన్ని పోస్టులు గిరిజనులకే చెందాలి అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గిరిజన చట్టాలను మార్పుచేసి కార్పొరేట్లకు అడవులను కొండలను ఖనిజ సంపదను అప్పచెప్తుంటే, కూటమి ప్రభుత్వం కేంద్ర బిజెపి ప్రభుత్వానికి అండగా ఉంటూ గిరిజనులను నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో గిరిజలంతా ఐక్యంగా మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ టీచర్ పోస్టులు మినహాయించాలని ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని జీవో నెంబర్ 3 ప్రకారము నూటికి నూరు శాతం గిరిజనులకు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే దీని గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల గిరిజనుల పాలిట శాపం గా మారిందని తెలిపారు . 2005 సంవత్సరం అటువకుల చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి పది ఎకరాలు చొప్పున పట్టాలు ఇవ్వాలని ఉన్న కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం గిరిజనులకు ద్రోహం చేయడమేనని అన్నారు. అటువాకుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వకుండా సాగులో ఉన్నటువంటి భూములకు 5 ఎకరాలు సాగులో ఉంటే 50 సెంట్లు ఎకరం 20 సెంట్లు అలా తక్కువ పట్టాలు ఇవ్వడం గిరిజనులకు ద్రోహం చేయడమేనని అన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో భూములన్ని అన్యాక్రాంతం అయ్యాయని సాగు చేస్తున్న భూములకు పూర్తిస్థాయిలో పట్టాలు మంజూరు చేయకపోవడం భూములు అన్ని కూడా అన్యాక్రాంతమవుతున్నాయని అనేక సందర్భాల్లో అధికారులకు తెలియజేసిన పట్టించుకోకపోవడం వలన గిరిజనులు పేదలు నష్టపోయారని అన్నారు. జీవో నెంబర్ 3 పైన గిరిజన చట్టాల పైన స్పష్టమైన హామీ మంత్రివర్యులు సంధ్యారాణి గారు ఇవ్వాలని. హామీలు అమలు చేయాలని వన్ బై సెవెంటీ చట్టం పీసా చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ గ్రామాల్లో చేర్చి గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రతి ఆశ్రమ పాఠశాలకి రెగ్యులర్ గా ఒక ఏఎన్ఎం ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు యువకులు పాల్గొన్నారు.

## రక్త దాతల స్ఫూర్తిని గౌరవిద్దాం.
### సుందరపు విజయ్ కుమార్




అనకాపల్లి,**ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14 :** ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా యల్లమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్ రక్త దానం చేసారని మునగపాక మండల టీడీపీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ రక్త దానం చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదములు తెలియజేసారు. రక్త దాతలంటే ప్రాణాల్ని నిలబెట్టే ప్రాణదాతలని, ప్రాణదాతల స్ఫూర్తి ని గౌరవిద్దాం, వారిని స్ఫూర్తి గా తీసికొని అందరూ రక్తదానం చేసి ప్రమాదం లో ఉన్న ప్రాణాల్ని కాపాడవచ్చు నని సుందరపు విజయ్ కుమార్ సుచించారు. రక్తదాతలంటే ప్రాణాల్ని నిలబట్టే ప్రాణదాతలు. రక్తదాతల స్ఫూర్తిని గౌరవిద్దాం నేడు " ప్రపంచ రక్తదాతల దినోత్సవం " రక్తదాతలుగా మారిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుదాం. ఈ కార్యక్రమం లో దొడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులు కాళ్ళ చంద్ర మోహన్ పాల్గొన్నారు.

## రక్త దానం వల్ల పది మంది ప్రాణం కాపాడవచ్చు.



అనకాపల్లి, **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14 :** ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కోరుమిల్లి పరమేశ్వర జగన్నాథరావు (పరి) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన శరీరానికి ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. ఒకరు దానం చేసిన రక్తము పది మంది ప్రాణాలు నిలబెడుతుందని రక్తదానం చేయడం ద్వారా ప్రజలకు ఎంతో కొంత మేలు చేసిన వారమవుతామని అన్నారు. 14 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి సమాజ సేవ చేస్తున్న కోరిబిల్లి పరి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువసార్లు రక్తదానం చేసిన రక్తదాతలను జ్ఞాపకతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రక్తదాతలందరినీ అభినందించారు.

## జిల్లా వ్యాప్తంగా యోగాభ్యాసన విజయవంతంగా మాక్ డ్రిల్





విజయనగరం, **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14 :** జిల్లా వ్యాప్తంగా శనివారం యోగా మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21 తేదీన ప్రధాని మోదీ విశాఖలో పాల్గొంటున్న యోగా కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా తీసుకుంది. దీనిలో భాగంగా గతనెల 21 నుంచి యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూన్ 21 న రికార్డు స్థాయిలో జరిగే ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి సన్నద్ధంలో భాగంగా, జిల్లా కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు, జిల్లా నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యం లో ఈరోజు జిల్లా వ్యాప్తం గా సచివాలయాల పరిధిలో సన్నాహక యోగా అభ్యాసాలు నిర్వహించారు. ఈ డెమో యోగ సాధన కార్యక్రమం వల్ల అంతర్జాతీయ యోగ దినోత్సవం



కార్యక్రమము లో లోటుపాట్లు ముందస్తు గా గుర్తించేందుకు దోహదపడుతుందని జాయింట్ కలెక్టర్ అన్నారు. 21 న జరగబోయే యోగ కార్యక్రమం లో ప్రతీ సచివాలయం జియో పెన్సింగ్ ద్వారా ఎంతమంది యోగాభ్యాసకులు హాజరవుతున్న సమాచారం యాప్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. ప్రధాన మంత్రి విశాఖలో హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమం లో జిల్లానుండి సుమారు ముప్పై వేలమంది యోగసాధకులను తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు జెసి ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా లో నమోదు అయిన 5652 కేంద్రాల్లో సుమారు 3 లక్షల మంది యోగ డెమో లో పాల్గొన్నట్లు చెప్పారు. ఇదే సాధన కొనసాగించి, 21 న జరిగే మెగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెసి కోరారు.

## ఉపాధ్యాయులు విద్యార్థులకు వెలుగినవ్వాలి, సొంత పిల్లలుగా చూసుకోవాలి:డీఈవో మాణిక్యం నాయుడు






విజయనగరం **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14 :** ఉపాధ్యాయులు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచి,చీకట్లో వెలుగు నిచ్చే టార్చ్ లైట్ వలే విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు అన్నారు.జనవిజ్ఞాన వేదిక విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం గురజాడ పాఠశాలలో ఉత్తరాంధ్ర జిల్లాల జెవివి సభ్యులకు శిక్షణా తరగతులను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో మాణిక్యం నాయుడు మాట్లాడుతూ ఉత్తమ సమాజాన్ని తీర్చిదిద్దు గలిగే శక్తి ఉపాధ్యాయులకే ఉందని,ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తమ పిల్లల పట్ల ఎంత శ్రద్ధ తీసుకుంటారో,అదే శ్రద్ధ విద్యార్థుల పట్ల చూపించాలని సూచించారు.ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని అన్నారు. ప్రతి ఒక్కరు తన మూలాలను మర్చిపోకూడదని, గతంలో మనం ఏ విధంగా విద్య నేర్చుకున్నాం,ఏ విధంగా బతికామో గుర్తుపెట్టుకుని నడుచుకుంటే ఉత్తమ విద్యార్థులను తయారు చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మంచి సమాజాన్ని తయారు చేసే శక్తి ఉపాధ్యాయులకే ఉంటుందని,ఉపాధ్యాయులకు భాష పై పట్టు ఉంటే విద్యార్థులకు భావాన్ని సులభంగా వ్యక్తం చేయవచ్చని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు నిత్యం కొత్త కొత్త అంశాలను తెలుసుకొని, విద్యార్థులకు పాఠశాలల్లో బోధించాలని తెలిపారు. విద్యార్థులకు మార్కులు ఒకటే ప్రామాణికం కాదని,జీవితంలో సమాజం పట్ల,తల్లిదండ్రుల పట్ల ఏ విధంగా బాధ్యతగా వ్యవహరించాలో ఉపాధ్యాయులు నేర్పించాలని తెలిపారు.జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ నిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజి, విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఏవి రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మిరియాల కృష్ణారావు,జిల్లా కోశాధికారి షిణగం శివాజీ,సమతా విభాగం అధ్యక్షురాలు యు.శాంతి కుమారి,సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి డిఎ జుగా అవగాహన కార్యక్రమాలు: కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్



**ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14 :** మన్యం జిల్లా.. జూన్ 14: గ్రామస్థాయిలో కార్యక్రమం విజయవంతం కావాలి. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆకాంక్ష జిల్లాలో నేటి నుంచి ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎ జెజియుఎ) అవగాహన కార్యక్రమాలను నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 15 నుంచి 30 వరకు డిఎ జుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. గిరిజనులకు ముఖ్యంగా ఆదివాసి గిరిజనులకు కావలసిన అవసరాలను గుర్తించి ధ్రువపత్రాలను జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిఎ జుగా నిర్వహణపై సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్ మాన్), ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డి ఎ జె జి యు ఎ )" కార్యక్రమాలను అమలుచేస్తున్న విషయాన్ని ఈ రోజు సందర్భంగా గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలో సేవలు, మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని అన్నారు. గ్రామ స్థాయి / క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా వివిధ సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో అందించే దిశగా ఈ కార్యక్రమం ఉద్దేశించబడిందని వివరించారు. ఈ రెండు కార్యక్రమాలను ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించుటకు జూన్ 15వ తేదీ నుంచి కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా వివిధ రకాల సేవలను అందించాలని ఆదేశించారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఆయుష్మాన్ భారత్ కార్డ్ (పి ఎం జె ఎ వై ),కుల ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ పత్రం, కిసాన్ క్రెడిట్ కార్డ్ (కె సి సి ), పియం కిసాన్ (పి ఎం - కిసాన్) కార్డులు, జన్ ధన్ ఖాతా,పిఎం జెజెబివై, పిఎం ఎస్ బివై బీమా కవరేజ్, వృద్ధాప్య,వితంతు,దివ్యాంగ సామాజిక భద్రత పింఛన్లు, ఉపాధి హామీ, పియం విశ్వకర్మ, ముద్ర తదితర జీవనోపాధి పథకాలు, పిఎం యంవివై, ఇమ్యునైజేషన్ తదితర స్త్రీ శిశు సంక్షేమ ప్రయోజనాలు మొదలైనవి అందించడం జరుగుతుందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన పేర్కొన్నారు. పివిటిజి గృహాలు, గిరిజన గ్రామాలను గుర్తించడం, గ్రామ స్థాయి / క్లస్టర్ స్థాయి శిబిరాలను నిర్వహించడం, ఆరోగ్యం, ఆహారం, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం, రెవెన్యూ ఇతర విభాగాల సమన్వయంతో ప్రచార కాలంలో తదితర కార్యకలాపాలు చేపట్టాలని అన్నారు. ఆధార్, ఇ - కెవైసి డాక్యుమెంటేషన్ సంబంధిత సేవల కోసం సంబంధిత విభాగాలు పనిచేస్తాయని, గ్రామస్థాయిలో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఆధార్ లో నమోదు కాని వారిని అంగన్వాడీ సిబ్బంది నమోదు చేయించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖలు జూన్ 15వ తేదీ నుంచి జరిగే అవగాహన శిబిరాల్లో వారికి ధ్రువపత్రాలను అందజేయాలని, మండల స్థాయి అధికారులు ఇందులో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్త దానం చేయండి, ప్రాణ దాతలు కండి



విజయనగరం **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14 :** జూన్ 14, ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ఒక విశ్లేషణ ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా జూన్ 14 న ప్రపంచ రక్త దాతల దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవం 1901 లో మొదటిసారిగా రక్తాన్ని వర్గీకరించిన ఆస్ట్రేలియాకు చెందిన నోబెల్ విజేత కార్ల్ లాండ్ స్టీనర్ జయంతిని పురస్కరించుకుని జరుపుకుంటారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేము. కానీ రక్తదాతల ద్వారా మరొకరి ప్రాణాలు కాపాడవచ్చు. మొదటిసారిగా ఈ దినోత్సవాన్ని 2004 లో అన్ని దేశాలు నిర్వహించారు.18 నుండి 55 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు రక్తదానానికి అర్హులు. రక్తదాతల శరీర బరువు కనీసం 50 కేజీలు ఉండాలి. రక్తదానం అనేది ఉత్తమ దానమని చెబుతారు. ఎందుకంటే రక్తదానం ఓ మనిషి జీవితాన్ని కాపాడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేయడం అవసరం, ఈ మధ్యకాలంలో జరిగిన రైలు ప్రమాదంలో చాలామంది యువకుల స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసి ప్రజల ప్రాణాలు కాపాడారు. రక్తదానం చేసే ముందు తరువాత కొన్ని జాగ్రత్తలు పాటించాలి. రక్తదానం చేసే ముందు ఐరన్ ఎక్కువగా ఉండే ఫుడ్ తీసుకోవడం చాలా మంచిది, దీనివలన బాడీలో రక్త ఉత్పత్తి పెరుగుతుంది మీలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది దీంతో అనీమియా సమస్య ఉండదు. దీంతోపాటు విటమిన్ సి సప్లిమెంట్స్ తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. ఎందుకంటే విటమిన్ సి, మీరు తినే ఫుడ్ నుండి ఐరన్ గ్రహించడంలో సహాయపడుతుంది. రక్తదానం చేసే ముందు రోజు బాగా నిద్రపోవాలి దీని కారణంగా హృదయ స్పందన బాగుంటుంది. మీ రక్తపోటు ఎక్కువగా ఉంటే మీరు రక్త దానం చేయలేకపోవచ్చు. పట్టుదల చేసే ముందు మిమ్మల్ని టెస్ట్ చేస్తారు. మీరు చిరాకు పడకుండా ఉండాలంటే వదులుగా ఉన్న బట్టలు వేసుకోవాలి. ఎందుకంటే కొందరిలో రక్త పోటు పెరుగుతుంది. మరికొందరికి భయం వల్ల గుండె వేగం పెరుగుతూ తగ్గుతుంది కాబట్టి తేలికైన వదులుగా ఉన్న బట్టలు వేసుకోండి. ఎలాంటి పరిస్థితుల్లో కొవ్వుతో కూడిన ఆహారం తీసుకోవద్దు. దీంతో రక్త నమూనాలను పరీక్షించడం కష్టతరం అవుతుంది. ప్రతి ఒక్కరు రక్తదానం చేయలేరు కానీ ప్రతి ఒక్కరూదానం చేయడానికి అవగాహన కల్పించవచ్చు. రక్త దానం చేయమని ఇతరులకు ప్రోత్సహించవచ్చు. మీరు ఆరోగ్యంగా ఉన్నట్లయితే దయచేసి రక్తదానం చేయండి. మీ ఒక్క రక్తపు బొట్టుతో ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చు, మీ రక్త దానం మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చు.. కాబట్టి రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి...

## జూన్ 15 నుండి 30 వరకు ధర్తీ ఆబా అభియాన్
### జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్



విజయనగరం, **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14 :** జూన్ 15 నుండి 30 వరకు దర్తి ఆబా అభియాన్ పేరుతో గిరిజన లబ్ది దారులకు పలు కేంద్ర ప్రభుత్వ పథకాల పై అవగాహన కలిగించడం, లబ్ధిచేకూర్చడానికి సంపూర్ణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబెద్కర్ తెలిపారు. ప్రధాన మంత్రి జనజాతీయ ఆదివాసి న్యాయ మహా అభియాన్ మరియు ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలో లక్షిత జోక్యాల ద్వారా సేవలు మౌలిక సదుపాయాలను సంపూర్ణంగా అందించడం లక్ష్యం తో ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా అవగాహన కల్పించడం, సంప్రదాయ ప్రచారాల వలె కాకుండా, ఈ ప్రచారం గ్రామం/క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా లబ్ధిదారులకు ఆధార్ కార్డులు , రేషన్ కార్డులు , ఆయుష్మాన్ భారత్ కార్డులు, కుల ధృవీకరణ పత్రాలు , నివాస ధృవీకరణ పత్రాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, పీఎం కిసాన్, జన్ ధన్ ఖాతా , గ్యాస్ కనెక్షన్లు, బీమా కవరేజ్ , సామాజిక భద్రతా పెన్షన్లు, ఉద్యోగ జీవనోపాధి పథకాలు, పీఎం విశ్వకర్మ, ముద్ర రుణాలు, మహిళా శిశు సంక్షేమ/ఆరోగ్యం ప్రయోజనాలు, టీకాలు తదితర హక్కులను, సేవలను అందించడం జరుగుతుందన్నారు. అన్ని కార్యకర్తల చురుకైన భాగస్వామ్యంతో ఈ శిబిరాలను నిర్వహించడానికి, క్షేత్ర స్థాయి లో విజయం సాధించడానికి అన్ని లైన్ డిపార్ట్మెంట్ల ఏకీకరణ మరియు భాగస్వామ్యం అవసరమని తెలిపారు. వ్యక్తిగత అర్హతల పంపిణీలో లోపాలున్న పివిటిజి ఆవాసాలు మరియు ఎంపిక చేసిన గిరిజన గ్రామాలను గుర్తించడం జరుగుతుందని, జూన్ 15 నుండి 30 వరకు గ్రామ/క్లస్టర్ స్థాయి లబ్ధిదారుల సంతృప్త శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాలను గిరిజనులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు




**ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14 :**/మన్యం జిల్లా.. జూన్ 14 : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం జిల్లాలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు జరిగాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్న నేపథ్యంలో, దానికి సన్నాహక చర్యలు మరియు యోగ అభ్యాసన క్రింద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 3,800 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించగా, ప్రతి చోటా పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి యోగాలో పాల్గొనడం విశేషం. ఈ ఏర్పాట్లను సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, స్థానిక అధికారులు చేపట్టగా, పలు చోట్ల ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది భాగస్వామ్యమయ్యారు. కాగా యోగా కార్యక్రమంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని, గర్భిణీలను మినహాయింపు చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునివ్వడంతో వారిని ఈ కార్యక్రమంలో మినహాయించారు.



## సాయికుమార్, సాయిరేవంత్ లకు సత్కారం



గజపతినగరం:**ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14 :** ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం విజయనగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్థానిక సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష,కార్యదర్శులు సాయి కుమార్, సాయి రేవంత్ లకు ఘన సత్కారం జరిగింది. యన్ .వి .యన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీసెట్టి బాబ్జీ పాల్గొని ఇరువురిని సన్మానించారు . సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు సాయికుమార్, సాయి రేవంత్ సంయుక్తంగా అనేక రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ,యువకులుకు రక్తదాన ఆవశ్యకతను వివరిస్తూ, రక్తదానం చేసే విధంగా చైతన్యం చేయడంలో ముందుండడం ప్రశంసనీయమని ముఖ్య అతిథి బీశెట్టి బాబ్జి ఈ సందర్భంగా అన్నారు.



## ఘనంగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్ జన్మదిన వేడుకలు,



అనకాపల్లి, **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14 :** తేది :13-06-2025 శుక్రవారం నాడు జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్,ఆర్కే ఫంక్షన్ హాల్ నందు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ జన్మదిన వేడుకలు యువ మోర్చా బొడ్డు గురునాథ్,ఏ.శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి,వేద పండితులచే వేద ఆశీర్వాదంతో బిజెపి నాయకులు,కార్యకర్తలు నాయకులు కేతినేని సురేంద్రమోహన్ ని ఘనంగా స్వాగతించారు,అనంతరం బిజెపి నాయకులు కార్యకర్తలు నడుమ సురేంద్రమోహన్ కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు,ఈ కార్యక్రమంలో లిబిజెపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు,మరియు పెందుర్తి బిజెపి నాయకులు %఑% జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు,మరియు (చినముషీడివాడ మండలం )బిజెపి 95,97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్,గార్లు సురేంద్రమోహన్ గారికి శాలువాతో సత్కరించి,పూల మొక్క,పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు,కూచిపూడి నృత్య ప్రదర్శన,బాణాసంచార,ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి,కార్యక్రమంలో టిడిపి పెందుర్తి యువ నాయకులు గండి వంశీ దీప్ గారు,మరియు 95,97వ వార్డుల బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన వెంకట సంతోష్,రాపర్తి దుర్గాప్రసాద్,కొత్తపల్లి అప్పలరాజు,బొబ్బర నాగరాజు,గౌరి కుమారి,మాధవి, భవాని,కెవిఆర్.లక్ష్మి,లావణ్య,మరియు కూటమి నాయకులు,కార్యకర్తలు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు

ప్రజాస్వామ్యం
తెలుగు దినపత్రిక
PRAJASWAMYAM TELUGU DAILY



## సెంచరీ చేద్దాం అనుకున్న అర్ధసెంచరీకి చేరలేకపోయాను.



అనకాపల్లి, **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14** :అంతర్జాతీయ రక్తదానం దినోత్సవం సందర్భంగా పొలమరశెట్టి సత్యనారాయణ రక్త దానంలో సెంచరీ కొడదామనుకున్నానని అయితే అర్ధసెంచరీ కి కూడా రెండురక్తదానాలకు దూరంలో ఆగి పోయినందుకు ఎంతో బాధ పడుతున్నట్లు ఒకప్రకటన ద్వారా తెలియ జేశారు. అయితే ఒక 18సంవత్సరాల టాటా నుండి వచ్చిన బాబు రక్త దానం చేయడం చూసి సత్యనారాయణ స్పందించనన్నారు. 1978నుండి రక్తం దానం చేయడం ప్రారంభించి 2018లో డాక్టర్ సలహా మేరకు రక్త దానం చేయడం ఆగిపోయినందుకు చాలా బాధ పడుతూ చెప్పారు. రక్త దానం చేయడం వల్ల ఎంతో మందికి ప్రాణదానం చేయడం జరుగుతుంది అని అన్నారు. రక్త దానం చేసిన వారికి ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉండవని భరోసా ఇచ్చారు. అయితే రక్త దానం చేసిన వారికీ కొత్త రక్తం వస్తుందని చెప్పారు. అందుకే అందరూ రక్త దానం చేయండి, ప్రాణదాతలుగా గౌరవంగా జీవించమని సత్యనారాయణ సూచించారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



విశాఖపట్నం : **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14** : ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు లబ్ధిదారులకు అందజేశారు. ఈ మేరకు శనివారం నార్త్ ఎక్స్టెన్షన్ లో గల బిజెపి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 51,44 వార్డులకు సంబంధించిన పి.ఎన్.ఎస్. వర్మ చిన్న కొండేపూడి 3,50,000/-, సాయి చరణ్ ప్రకాష్ 2,00,000/-, కోఇలాడా పద్మావతి 30,000/-, సురు మాణిక్య రావు 60,000/-,కె. అలివేలు మంగ దేవి 70,000/-, సామి రెడ్డి రాజేశ్వరి 75,090/- లబ్ధిదారులకు అందజేశారు. సుమారు 7,85,090 లక్షల రూపాయల చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరు అనారోగ్యం పాలైన హాస్పిటలకు సంబంధించిన ఒరిజినల్ బిల్స్ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్యామల దీపికా, జిల్లా అధ్యక్షులు పరసురమ రాజు, ఉత్తర నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ పసుపులేటి. ఉష కిరణ్, బీజేపీ నార్త్ కన్వీనర్ సురేష్ బాబు, బిజెపి టిడిపి జనసేన పార్టీ అధ్యక్షులు కోఇలాడా వెంకటేష్, నాగరాజు, మల్ల లక్ష్మీ, రఘు, కీర్తి, శ్రీనివాస్, లోహిత రావు, పరమేశ్వర రావు, శంకర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## యోగ చేయండి ఆరోగ్యంగా ఉండండి

### వైయస్సార్ కాలనీలో యోగా అవగాహన కార్యక్రమం




మధురవాడ విశాఖపట్నం **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14** : ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఈనెల 21వ తేదీన జరగబోయే యోగాంధ్ర కార్యక్రమానికి సర్వం సిద్ధం కాబోతుంది, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు ప్రతి ఒక్కరూ యోగ చేయాలని ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈనెల 21వ తేదీన జరగబోయే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొవాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈరోజు మధురవాడ వైయస్సార్ కాలనీలో 72, మరియు 73 సచివాలయాల ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 72, మరియు 73 నెంబర్ సచివాలయల వెల్ఫేర్ సెక్రటరీస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి అంటే యోగ చేయాలని అన్నారు. మనసా వాచా కర్మణా ఒక మనిషి 21 రోజు ఒక కార్యాన్ని నిర్వహించినట్లయితే ఆ పని ఆ మనిషి జీవన విధానంలో ఒక ప్రక్రియల మాడుతుందని అన్నారు. ఈనెల 21వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగబోయే ఈ యోగాంధ్ర కార్యక్రమాని కి ప్రతి ఒక్కరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 72 వ సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ గౌస్య, 73 వ సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ కిరణ్ కుమార్, ఆర్ పి.గంగాభవాని, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ను ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



విశాఖపట్నం **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14** : జిల్లా అందత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్ గుర్తించిన వారికి, మరియు కంటి సమస్యలతో బాధపడుతున్నా వారికి శంకర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని, వన్ టౌన్ నందు ఉన్న శ్రీ స్వామి వివేకానంద సంస్థ నందు నిర్వహించారు ఈ కంటి వైద్య శిబిరంలో దాదాపు 200 మంది ఓ.పి కి హాజరయ్యారు 44 మంది ఆపరేషన్ నిమిత్తం ఎన్ని కయ్యారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దక్షిణ శాసనసభ నియోజకవర్గ సభ్యులు వంశీకృష్ణ విచ్చేసి, కంటి శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం అనాధాశ్రమంలో వృద్ధులను పరామర్శించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని, వృద్ధులకు వస్త్ర దానం చేశారు వివేకానంద సంస్థ ఏర్పాటు చేసిన అన్న దానం కార్యక్రమంలో పాల్గొని భోజనాలను వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ మాట్లాడుతూ వివే కానంద సంస్థ వారు అలు పెరగని నిత్య సేవా కార్య క్రమాలతో రక్తదాన శిబిరాలు, ఉచిత కంటి వైద్య శిబిరాలు బి.పి, షుగర్ కాపుల, గుండె సంబంధిత క్యాంపులు, జనరల్ క్యాంపులు, అన్న దాన కార్యక్రమాలతో నిత్య అలుపెరగని సేవా కార్య క్రమాలు అందిస్తున్న వివేకానంద సంస్థ వారిని ఆయన అభినందించారు. ఈ కార్య క్రమంలో



బోధలపాటి. ఉమా మహేశ్వర్ రావు మరియు వివేకానంద సంస్థ అధ్యక్షులు అప్పారావు, సంస్థ సభ్యులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చోడవరం లో రక్తదాన శిబిరం విజయవంతం




చోడవరం,**ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14** : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని చోడవరం లో రాక్ ఫ్రెండ్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి యువత, విద్యార్థులు, సంఘసేవా సంస్థలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సకురు కొటేశ్వరరావు తన 13వ సారి రక్తదానం చేశారు. ఇది ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. 'రక్తదానం చేయడం ద్వారా మనం ఎవరికో ఒకరి ప్రాణాలను రక్షించగలము. అందరూ ముందుకొచ్చి రక్తదానం చేయాలి అని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో 50 మంది రక్తదాతలు పాల్గొన్నారు. వారందరికీ ధృవపత్రాలను అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన రాక్ ఫ్రెండ్స్ సభ్యుల నరేంద్ర, షణ్ముఖ, నాయుడు, చక్రీ, మధు, మూర్తి, సాయి కృషిని నిర్వాహకులు అభినందించారు. ఈ రక్తదాన శిబిరం అనేకమందికి ప్రాణాధారంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

## ముస్లిం బాలుడి ఫీజుకోసం వాసుపల్లి రూ. 5000 సాయం

**వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో 1,70,467 మందికి అమ్మవడి వచ్చింది.**

**తల్లికి వందనం లక్షకు పైగా అనర్హులు చేశారు**

**మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**



విశాఖపట్నం **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14** : ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ. 15000 ఇస్తామని కూటమి నేతల హామీ ఇచ్చి లక్షమంది పైగా అనర్హులు చేసి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్కుమార్ విమర్శించారు. ఆసీలమెట్ట కార్యాలయంలో 39 వ వార్డు పోస్ట్ ఆఫీస్ ప్రాంతానికి చెందిన రెహానా భాష (12) స్కూల్ ఫీజుకి వాసుపల్లి గణేష్ కుమార్ 5000 ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది తర్వాత తల్లికి వందనం పథకం హడావిడిగా ప్రారంభించి లబ్ధిదారుల సంఖ్యలో భారీ కోత విధించారన్నారు. వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో 1,70,467 మందికి అమ్మవడి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో మూడు లక్షల నుండి మూడున్నర లక్షలు మంది విద్యార్థులు లబ్ధి చేరుతుందని భావించారు. కానీ 12000 జీతాలు దాటిన వారికి, 300 యూనిట్లు కరెంట్ బిల్లులు, ఆస్తులు లేని వారికి ఆస్తులు ఉన్నట్లుగా చూపించే అర్హులైనవారిని లక్ష మంది పైగా విద్యార్థులకు తల్లికి వందనంలో కోత విధించారన్నారు. పేదల గుండెచప్పుడు తెలిసిన జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పథకాలు నేరుగా ప్రజల ఖాతాల్లో అర్హులందరికీ చేర్చిన ఘనత వైయస్ఆర్సీపీ దేనన్నారు. కానీ 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు ఇచ్చిన పథకాలు అమలు చేయలేక, మభ్యపెడుతూ అర్హులైన పేదవాడి ఉసురు పోసుకుంటున్నాడని అన్నారు. ఎంతోమంది పిల్లలు బడి ఫీజులు అమ్మ ఒడి ద్వారా వస్తాయని ఎదురుచూసిన వారికి కూటమి ప్రభుత్వం నిరాశ మిగిల్చిందన్నారు. ఈ చేతకాని ప్రభుత్వ విధానాల వలన సంక్షేమం నోచుకోని పేద ప్రజలు మళ్లీ వారి పిల్లల్ని స్కూలు మానిపించే పరిస్థితులు తీసుకొస్తున్నారని మండిపడ్డారు. పేదవాళ్ళకి నాణ్యమైన విద్య అందించేందుకు కార్పొరేటర్ స్థాయిలో స్కూల్లో అభివృద్ధి చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. నాడు జగనన్న బడి పిల్లలకు అమ్మ ఒడి, కళాశాల విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్లు అందజేసి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం మళ్లీ ఆంధ్రప్రదేశ్ పాలనను అంధకారంలోకి నెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. సంవత్సరంలోనే విసుగు చెందిన ప్రజలు మళ్లీ జగనన్న సుపరిపాలనను కోరుకుంటున్నారని వాసుపల్లి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 39 వ వార్డు వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు, సౌత్ బూతు కమిటీ అధ్యక్షుడు ముజీబ్ ఖాన్,30వ వార్డ్ అధ్యక్షుడు దశమంతలు మాణిక్యాలరావు , 38 వ వార్డ్ సన్యాసిరావు, సౌత్ యూత్ అధ్యక్షుడు తాడి రవితేజ, వేణు, సత్య, వెంకటి వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 11 ఏళ్ల గా శిధిలావస్థలో వడ్డాది - నర్సీపట్నం బిఎన్ రోడ్డు..

**పెద్ద పెద్ద చెరువులను తలపిస్తున్న అద్భుతమైన వైనం**

**సొంత వ్యాపారాలు పక్కన పెట్టు.!!**

**నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టు.!!**

**రెండు చేతులు జోడించి మోకాలు పై నిల్చొని వినూతనంగా ధర్నా**

**సిపిఎం పార్టీ నాయకులు కె. గోవిందరావు**



చోడవరం / రావికమతం **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14** : ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రధాన రహదారి అయిన చోడవరం నుండి పాడేరు, వడ్డాది నుండి నర్సీపట్నం బి ఎన్ రోడ్డు పూర్తిగా శిధిలావస్థకు చేరుకొని, చెరువులను తలపించే విధంగా ప్రజలకు దర్శనమిస్తున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారిన, ఎంతమంది పాలకులు వచ్చినా ఈ రోడ్డుకు మోక్షం కలగలేదు. దీనికి నిరసనగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కొత్తకోట బిఎన్ రోడ్డుపై రెండు చేతులు జోడించి మోకాలు పై నిల్చొని వినూతనంగా ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు మాట్లాడుతూ ఈ రోడ్లు గత 11 ఏళ్ల నుంచి వడ్డాది నుంచి నర్సీపట్నం వరకు రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారిపోయింది అన్నారు. అలాగే వడ్డాది, విజయరామరాజుపేట బ్రిడ్జిలు కూలిపోయి ఏండ్లు గడుస్తున్నప్పటికీ వాటినీ పట్టించుకునే నాథులు కరువయ్యారన్నారు. తక్షణమే ఈ రోడ్డును, ఆ రెండు బ్రిడ్జిలు నిర్మాణాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రోడ్డు గుండా ప్రయాణం చేసే అనేకమంది పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, వాహన చోధకులు నరకయాతన పడుతున్నారని అంతే కాకుండా పలు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్న పరిస్థితులు అనేకము ఉన్నాయన్నారు. చినుకు పడితే చాలు రోడ్లు చిత్తడి, చిత్తడిగా చెరువులను తలపించే విధంగా గొయ్యిలు పూర్తిగా నీటితో నిండిపోయి రోడ్డు కనిపించని పరిస్థితి నెలకొందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు, అలాగే గర్భిణీ స్త్రీలు ఈ రోడ్డు గుండా పలు రకాల పనుల నిమిత్తం ప్రయాణం చేయాలంటే నరకం చూడాల్సిందేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, గత ప్రభుత్వం వైఫల్యాన్ని అధిగమించి అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్,ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు గత ఏడాది ఎన్నికల్లో గెలిచిన వెంటనే బిఎన్ రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు అన్నారు. ఇచ్చిన హామీ సంవత్సరం పూర్తయి, రెండువ సంవత్సరంలో అడుగు పెడుతున్నప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందాగా కనీసం పిడుకుడు మట్టి కూడా ఎక్కడ వేయలేదు అన్నారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగా పేరుతో సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రతి పాఠశాలలో ఒక యోగా టీచర్ ను నియమించి, ఆయా గ్రామాల పాఠశాల విద్యార్థులతో పాటు, ఆ గ్రామ యువకులకు కూడా యోగాను నేర్పిస్తే ఉపయోగం తప్ప ఫోటో స్టిల్లుకు తీస్తున్న యోగ నిజమైన యోగ కాదని ఆయన ఆరోపిస్తున్నారు. యోగ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా ఫోటో స్టిల్ ఇస్తు యోగా చేస్తున్నట్టు చెప్పుకుంటున్నారన్నారు. ఈ యోగాను పక్కనపెట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిజమైన పేద ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దృష్టి పెట్టి తక్షణమే బిఎన్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని,సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. నర్సీపట్నం నుండి. చోడవరం వెళ్లే ఈ రోడ్డు మార్గంలో అనేకమంది విద్యార్థులు చదువుల కోసం రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు మొత్తం గోతులమయంతో ఉండడం వలన ఈ రోడ్డు పైన బస్సులు నడపలేకపోతున్నామని ఆర్టీసీ అధికారులు సైతం చెబుతున్నారని తెలిపారు. స్కూలు పిల్లలకు బస్సులు సమయానికి రాకపోవడంతో, పాఠశాలకు కూడా సమయానికి చేరుకోలేకపోతున్నారన్నారు.స్కూ స్కూల్ నుండి ఇంటికి చేరుకొనేటప్పటికీ రాత్రి 11 గంటల సమయం పడుతుంది అన్నారు. ఇలా అయితే ఆడపిల్లల పరిస్థితి ఏమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఎంపీ, ఎమ్మెల్యేలు తక్షణమే రోడ్డు నిర్మాణం పనులు చేపట్టకపోతే భారీ ఎత్తున ఆందోళన చేపట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల నాయకులు గేమిల వాసు, సింగారపు వలసయ్య,సిపిఎం నాయకులు పి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## రిలయన్స్ ఫౌండేషన్ సాంకేతికత తో లాభదాయకంగా ' చేపల వేట'...

**ప్రజాస్వామ్యం న్యూస్ ప్రతినిధి తో మత్స్యకారుడు పొలిరాజు**

అనకాపల్లి రూరల్, **ప్రజాస్వామ్యం న్యూస్ జున్ 14** :రిలయన్స్ ఫౌండేషన్ సాంకేతికత తో చేపల వేట లాభదాయకంగా సాగుతుందని మత్స్యకారుడు పొలిరాజు తన అబుభావాలను పంచుకున్నారు. ప్రజాస్వామ్యం న్యూస్ ప్రతినిధి తో మత్స్యకారుడు పొలిరాజు మాట్లాడారు నాపేరు పొట్టి పొలిరాజు, మాది పెదజాలరిపేట గ్రామం సంప్రదాయ మత్స్యకారుడు గా నా జీవనం కొనసాగిస్తున్నాను. మా నాన్న సంప్రదాయ మత్స్యకారుడు కావడం వలన, చిన్ననాటి నుండి సముద్ర జీవితాన్ని అనుసరిస్తూ, అదే వృత్తిని జీవనోపాధిగా ఎంచుకోవలసి వచ్చింది. నేను బాల్యంలో నుండే నాన్నతో కలిసి రోజుకు సుమారు 6 మైళ్ల దూరం వరకు తెప్ప, తెరచాప సహాయంతో వేటకు వెళ్ళేవాడిని. అలా అనేక సవాళ్లను ఎదుర్కొంటూ జీవనం సాగించేవాళ్ళం. మా కుటుంబంలో నేను, నా భార్య, ముగ్గురు పిల్లలు, తల్లిదండ్రులు కలిసి నివసిస్తున్నాము. మత్స్యవేట మా ప్రధాన ఆదాయ వనరు. మా నాన్న కాలం నుండి ఉపయోగిస్తున్న పాత కట్టల తెప్ప, తెరచాప, కట్లతోనే వేట కొనసాగిస్తూ వచ్చాము. తెల్లవారుఝామున 3 గంటలకు బోటులో బయలుదేరి సాయంత్రం 4 గంటల వరకు సముద్రంలో ఉంటూ వేట చేసేవాళ్ళం. ఈ వ్యవధిలో అనేక ప్రమాదాలు, సవాళ్లు ఎదుర్కొంటూ ఉండేవాళ్ళం. ఇటీవలి కాలంలో బోటుకు మోటార్ అమర్చడం ద్వారా వేట మరింత సులభమైంది. అలాగే, మా గ్రామానికి తరచూ రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు. వచ్చేవారు వారు మాకు సాంకేతికత ఉపయోగంతో వేట చేయడం ఎలా లాభదాయకమో వివరించారు. మచిలీ యాప్, ఇన్కాయిస్ సముద్ర సమాచార యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1800 419 8800 ఉపయోగాలను కూడా వివరించారు. నా ఫోన్ నెంబర్‌కు వాయిస్ మెసేజ్‌లతో పాటు వాట్సప్ ద్వారా టెక్స్ట్ మెసేజ్‌లు కూడా వారి నుండి ఏర్పాటు చేశారు. అప్పటి నుండి నేను తరచూ టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి గాలి వేగం, అలల ఎత్తు, తుఫానుల సమాచారాన్ని సముద్రములో చేపలు దొరుకు ప్రాంతాలు గురుంచి తెలుసుకుంటూ వచ్చాను. మాకు అందుతున్న సమాచారం ఆధారంగా వేటకు వెళ్దామా వద్దా అనే నిర్ణయం



సముద్రము వద్దా వద్ద తీసుకునే అవకాశం వచ్చింది. ఇలా చేయడం వల్ల మేము మా ప్రాణాలు, ఆస్తులను కాపాడుకోగలుగుతున్నాము. సాధారణంగా 10 నుండి 35 కి.మీ. గాలి వేగం ఉంటే వేట కొరకు తెరచాప వాడతాము. 10 కి.మీ. కన్నా తక్కువ గాలితో లేదా 40 కి.మీ కంటే ఎక్కువ గాలి వేగంతో ఉంటే మేము మోటార్ బోటును వాడుతాము. అయితే గాలి వేగం 55 కి.మీ. కంటే ఎక్కువగా ఉంటే, వేటకు వెళ్ళకుండా ఇంటి వద్ద ఉండిపోతాము. ఇది మాకు, మా మత్స్యకారు ప్రజలకు రక్షణ కలిగిస్తోంది. రిలయన్స్ ఫౌండేషన్ సూచనల ఆధారంగా తగిన సమయంలో తెరచాప వాడటమా, మోటార్ బోటా అని నిర్ణయం తీసుకోవడం వల్ల ఒక్క ఏడాదిలో సుమారుగా 1 లక్ష రూపాయలు డీజిల్ ఖర్చు ఆదా అవుతోంది. సమయం కూడా ఆదా అవుతోంది. మేము పట్టణానికి దగ్గరగా ఉన్నందున ఆ అదనపు సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధి చేసుకొని మరింత ఆదాయం పొందుతున్నాము. సాంకేతికత రాకముందు సుమారు 300 రోజులు వేట చేసేవాళ్ళం. అందులో చాలా రోజులు చేపలు దొరకక పోయిన రోజులు ఎన్నో , ఖర్చు అదికము అయిన రోజులు ఎన్నో ఉన్నాయి. కానీ ఇప్పుడు సుమారు 200 రోజులు మాత్రమే వేట చేస్తూ, ప్రమాదాలను తగ్గించుకుంటూ, అధిక ఆదాయం పొందుతున్నాము. డిసెంబర్‌లో వచ్చిన తుఫాన్ గురించి ముందుగా ఇన్కాయిస్ ద్వారా సమాచారాన్ని రిలయన్స్ ఫౌండేషన్ మాకు అందించింది. వారి సూచనల ప్రకారం మా గ్రామం మొత్తం వేటకు వెళ్లకుండా ఆగిపోయింది. తుఫాన్ వచ్చినా మేము మా వలలు, బోట్లు, ఆస్తులను కాపాడుకున్నాము. ముఖ్యంగా మా ప్రాణాలను కాపాడుకున్నాము. ఇలా, రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా అందిన సరైన సమాచారంతో మా గ్రామంలోని మత్స్యకారులు ఎంతో ప్రయోజనం పొందుతున్నారు. ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారం అందిస్తున్న ఇన్కాయిస్, రిలయన్స్ ఫౌండేషన్ వారికి మా గ్రామం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

## ప్రశ్నించడం... మరచిపోతున్నామా?

వైజ్ఞానిక ఆవిష్కరణ, సామాజిక సంస్కరణ, ఆధ్యాత్మిక అన్వేషణ... ఏదైనాసరే మనిషి ఆలోచన, ప్రశ్నతోనే మొదలవుతాయి. విద్య, విజ్ఞానం, సమాచారం అందరికీ అందివస్తున్న నేటి కాలంలో సమాజంలో ఆలోచన, చైతన్యం మరింతగా పెరగాలి. కానీ, అందుకు భిన్నంగా ప్రజల్లో విమర్శనాత్మక దృష్టి, ప్రశ్నించేతత్వం తగ్గిపోతోంది. పరిశీలన కంటే నమ్మకానికీ, ఆలోచన కంటే మూస అభిప్రాయాలకే పెద్దపీట లభిస్తోంది. వైజ్ఞానిక ఆవిష్కరణ, సామాజిక సంస్కరణ, ఆధ్యాత్మిక అన్వేషణ... ఏదైనాసరే మనిషి ఆలోచన, ప్రశ్నతోనే మొదలవుతాయి. విద్య, విజ్ఞానం, సమాచారం అందరికీ అందివస్తున్న నేటి కాలంలో సమాజంలో ఆలోచన, చైతన్యం మరింతగా పెరగాలి. కానీ, అందుకు భిన్నంగా ప్రజల్లో విమర్శనాత్మక దృష్టి, ప్రశ్నించేతత్వం తగ్గిపోతోంది. పరిశీలన కంటే నమ్మకానికీ, ఆలోచన కంటే మూస అభిప్రాయాలకే పెద్దపీట లభిస్తోంది. నిజానిజాల విశ్లేషణ, చర్చల స్థానంలో భావోద్వేగాలూ హింస చోటుచేసుకుంటున్నాయి. మన దగ్గరే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఇటువంటి ధోరణే ప్రబలుతుండటం ఆందోళనకరం. పలు అభివృద్ధి చెందిన దేశాల్లోనూ భూమి బల్లపరుపుగా ఉందని నమ్మేవారు లేకపోలేదు. అతివాద భావాలతో ప్రజలను రెచ్చగొట్టేవారు నాయకులుగా చెలామణీ అవుతున్నారు. కీలక పదవులు చేపడుతున్నారు. కొవిడ్-19 ఉద్ధృతి వేళ వ్యాక్సిన్ల మీద తప్పుడు సమాచారం, నిరాధారమైన వదంతులు ఎంతోమందిని అయోమయంలోకి నెట్టేశాయి. నేటి సోషల్ మీడియా కాలంలో నకిలీ వార్తలు వేగంగా చక్కర్లు కొడుతుండటం, చాలామంది వాటిని ఇట్టే నమ్మేస్తుండటం దురదృష్టకరం. ఉన్నత విద్యావంతులు సైతం డిజిటల్ మోసాల బారినపడి డబ్బులు పోగొట్టుకుంటున్నారంటే ఆశ్చర్యం వేయక మానదు.

### మేధావులూ సంకోచిస్తున్నారు

ఆ మధ్య ఉత్తర్‌ప్రదేశ్‌లో 'భోలేబాబా' సత్సంగ్‌లో జరిగిన భారీ తొక్కిసలాట ప్రజల్లో మూఢత్వం ఏ స్థాయికి చేరిందో నిరూపించింది. ఆ బాబాను తాకడం కోసం, ఆయన పాదధూళి కోసం భక్తులు ఒక్కసారిగా ఎగబడటంతో 120 మందికి పైగా చనిపోవడం యావద్దేశాన్నీ విస్మయపరచింది. వేడుకల సమయంలో తొక్కిసలాటలు, మరణాలు సర్వసాధారణ విషయంలా మారిపోయాయి. విశ్వాసాలు, అవాంఛిత ప్రచారం వల్ల ప్రభుత్వాలు ఎన్ని ఏర్పాట్లు చేసినా కొన్నిసార్లు రద్దీ ఒక్కసారిగా పెరిగిపోయి దురదృష్టకర ఘటనలు జరుగుతున్నాయి. ఇటీవల ఏపీలో తీవ్రంగా జబ్బుచేసిన పాపను ఆసుపత్రికి తీసుకెళ్లకుండా ఓ ప్రార్థనా స్థలంలో రోజుల తరబడి ఉంచడంవల్ల ఆ చిన్నారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. చేతబడి చేస్తున్నారు, పిల్లల్ని అపహరిస్తున్నారనే వదంతులను నమ్మి మూకదాడులతో అమాయకులను చంపిన ఘటనలు సైతం ఆధునిక కాలంలో వెలుగు చూస్తున్నాయి. మరోవైపు- చెట్లు నరికేస్తున్నా, సహజ వనరులను కొల్లగొడుతున్నా, పర్యావరణ కాలుష్యం పెరిగిపోతున్నా ప్రశ్నించేవారే తక్కువైపోతున్నారు. సమాచార హక్కు(ఆర్టీఐ) ఉద్యమకారులను వేధించడం, వాళ్లను వాహనాలతో గుద్ది చంపడం వంటి ఉదంతాలు కొన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకున్నాయి. భిన్నమైన, వ్యతిరేకమైన అభిప్రాయాల పట్ల అసహనం పెరిగిపోవడం, సోషల్ మీడియా తోడవడంవల్ల ఈ మధ్య ప్రతిదీ వివాదాస్పదమవుతోంది. అందుకే, ఏ విమర్శ చేస్తే ఏ వివాదం రేగుతుందోనని మేధావులు

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. PTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022